క్లుప్తంగా

23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు

మునగపాక: క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎమ్మెల్యే విజయకుమార్ కోరారు. వాడ్రాపల్లిలో దీపావళి, నాగులచవితి వేడుకల సందర్భంగా ఈ నెల 23, 24 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీకి ఎంతో ఆదరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ యూత్, వీరాంజనేయ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న తోటాడ నివాసి పురోగామి

మునగపాక: మండలంలోని తోటాడ–గవర్ల అనకాపల్లి గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పలువురు దాతలు ఆలయ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. ఆదివారం తోటాడకు చెందిన బుద్ధ పశుపతిరావు జ్ఞాపకార్థం భార్య వరలక్ష్మి, కుమారుడు పురోగామి(యూఎస్‌ఏ) తమ వంతు సాయంగా రూ.1,01,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన అవసరం



భగవద్గీత శ్లోకాలపై అవగాహన కల్పిస్తున్న ఆధ్యాత్మిక కర్త పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మిక కర్త శరగడం పరదేశినాయుడు కోరారు. మండలంలోని తిమ్మరాజుపేటలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం భగవద్గీతపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పిల్లలు చదువుతో పాటు భగవద్గీతపై అవగాహన పెంచుకోవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. పిల్లలు సన్మార్గంలో నడవాలని కోరారు.

ఉద్యోగులకు నేత్ర వైద్య పరీక్షలు

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లోని అధీస్తాన్ అనుబంధ కంపెనీలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఈ శిబిరాన్ని సందర్శించి, పలు సూచనలు చేశారు.

ధ్వజ స్తంభం ప్రతిష్టాపన



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం మామిడివాడ కొత్తూరు శివాలయంలో ఆదివారం ధ్వజ స్తంభం ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కూడా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ముగిసిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవం

ఎస్.రాయవరం: ముస్లిం గ్రామాల్లో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముస్లిం యువత ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి సోమవారం వరకు గ్రామంలో రోజుకొక కార్యక్రమం నిర్వహించి సందడి చేశారు. గ్రామాల్లో చందల్ ఊరేగింపు కార్యక్రమం ఆకర్షణీయంగా నిలిచింది. చివరిగా ముస్లిం పెద్దలను ఘనంగా సత్కరించారు.

ఇచ్ఛా ఫౌండేషన్‌లో సేవా కార్యక్రమం



చిన్నారుల మధ్య కేక్ కట్ చేస్తున్న శివ

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్‌లో ఆదివారం చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. మళ్ల సాయి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంకే నాయుడు, బొబ్బిలి తేజ, లోకేష్, గుల్లిపల్లి వెంకటేష్, మళ్ల శివ, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ తీసేదెప్పుడో?



గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు

అధిక ధరలకు విక్రయిస్తున్న అక్రమార్కులు • కన్నెత్తి చూడని అధికారులు



యలమంచిలి దిమిలిరోడ్డు పెంకుల ఫ్యాక్టరీ వద్ద చెరువు గట్టు ఆక్రమించుకుని పెట్టిన మద్యం బెల్టు షాపు (అంతర చిత్రం) మద్యం షాపు వద్ద బీర్ల అమ్మకాలు

యలమంచిలి రూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోంది. అనుమతి పొందిన దుకాణాల పరిధిలో పదుల సంఖ్యలో గొలుసు దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో మద్యం అమ్ముకునేందుకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వేలం పాటలు కూడా నిర్వహించారు. ఒక్కో గ్రామంలో కనీసం 2 నుంచి 5 వరకు బెల్టుషాపులు ఉన్నాయి. బడ్డీ కొట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బజ్జీల బండ్లు, టీ, కూరగాయల దుకాణాలు, కొన్ని చోట్ల ఇళ్ల వద్ద కూడా మద్యం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. బెల్టుషాపుల ద్వారా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారు. గ్రామాల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. అధిక ధరలకు మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబుల జేబులకు చిల్లు పడుతోంది. మద్యం షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నా అబ్కారీ శాఖ అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడంలేదు. నియోజకవర్గంలో సుమారుగా 250కిపైగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్టు అంచనా. బెల్టు షాపుల్లో తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 11 గంటల వరకూ విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి.

అ'ధనం'గా వసూలు..

బెల్టు షాపుల్లో ప్రతి క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.60 వరకు అ'ధనం'గా వసూలు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో మద్యం కొనుగోలు చేసేవారు అడిగినంత ఇస్తున్నారు. దీంతో వీరి వ్యాపారం మూడు సీసాలు.. ఆరు గ్లాసులుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ, జనసేన నాయకులు మద్యాన్నే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఊరూరా మద్యాన్ని ఏరులై పారిస్తూ జేబులో వేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం షాపులను నేరుగా ప్రభుత్వమే నిర్వహించేది. దీనికితోడు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకే మద్యం విక్రయించేవారు. ఒక్క నిమిషం ముందుగానీ, తర్వాత గానీ షాపుల్లో మద్యం విక్రయాలు జరగకుండా స్కానర్లు పనిచేసేవి కాదు. దీనికి తోడు బెల్టుషాపులు లేకుండా కట్టడి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం విక్రయాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో రోజువారీ పనులు చేసుకునేవారు, ముఖ్యంగా యువత వేళాపాళా లేకుండా మద్యం తాగుతూ రోడ్ల మీద పడి దొర్లుతున్నారు. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడ్డంతో బెల్టుషాపుల నిర్వాహకులు మరింత బరితెగింపు చూపుతున్నారు. వారిపై అబ్కారీశాఖ అధికారులు నామమాత్రంగానే కేసులు పెడుతూ సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గుడి, బడి తేడా లేకుండా బెల్టు షాపులు ఏర్పాటు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిబంధనల ప్రకారం జాతీయ రహదారి పక్కన మద్యం దుకాణానికి లైసెన్సు ఇవ్వరు. కానీ యలమంచిలి మండలంలో పులపర్తి హైవే కూడలి వద్ద రెండు బడ్డీ దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నారు.



యలమంచిలి పట్టణంలో బస్ కాంప్లెక్స్ వద్ద మద్యం మత్తులో దొర్లుతున్న మందుబాబు



యలమంచిలి పట్టణంలో ఓ బెల్టుషాపు వద్ద మద్యం తాగుతున్న వృద్ధుడు

రెండు బీర్లపై రూ.100 అదనంగా వసూలు



యలమంచిలి పట్టణంలో సైతారుపేట రోడ్డులో ఉన్న మద్యం బెల్టుషాపు వద్ద ఇటీవల రెండు బీర్లు కొనుగోలు చేశాం. ఒక్కో బీరుపై రూ.50 అదనంగా వసూలు చేశారు. రెండు బీర్లకు రూ.500 ఫోన్ పే ద్వారా చెల్లించాను. ఇదేమిటని అడిగితే బెల్టు షాపు నిర్వాహకుడు దురుసుగా సమాధానం చెప్పాడు.

– చాకలి సూకరాజు, యలమంచిలి

ఫిర్యాదు చేస్తే చర్యలు

బెల్టు షాపులకు ఎలాంటి అనుమతులు లేవు. ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తరచూ తనిఖీలు చేస్తున్నాం. ఈ నెల 2న ఒక బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశాం.

– ఎం.జ్ఞానేశ్వరి, ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ, యలమంచిలి

అధ్వానంగా గ్రామీణ రహదారులు



తుప్పలతో దర్శనమిస్తున్న చౌడువాడ రోడ్డు



అధ్వానంగా అన్నవరం జంక్షన్‌లోని రహదారి

కోటవురట్ల: గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోతులకు తోడు పిచ్చిమొక్కలు వాహనచోదకులను బెంబేలెత్తిస్తున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రహదారులు దారుణంగా దర్శనమిస్తున్నాయి. పైగా వర్షాలకు రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మలుపుల్లో రహదారులను కమ్మేస్తున్న పిచ్చిమొక్కల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారుల బాగోగులను పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. దాంతో అధ్వానంగా రహదారుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితులకు తోడు జంగిల్ క్లియరెన్సు చేపట్టకపోవడంతో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. రాజుపేట, అన్నవరం, చౌడువాడ, గొట్టివాడ రహదారులు గోతులమయమయ్యాయి. అధికారులు స్పందించి గోతులను పూడ్చడంతో పాటు జంగిల్ క్లియరెన్సు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సాగుభూమిలో రోడ్డు నిర్మాణం తగదు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం లాలం కోడూరు శివారు చాటిమెట్ట వద్ద సాగుభూమిలో ఒక ప్రైవేట్ కంపెనీ కోసం రోడ్డు నిర్మించి సదరు రైతుకు అన్యాయం చేయడం తగదని సీపీఎం మండల కన్వీనర్ జి.దేవుడునాయుడు అన్నారు. రోడ్డు నిర్మాణాన్ని సీపీఎం నాయకులు రైతుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషతుల్యం చేసే కంపెనీలకు అనుకూలంగా రోడ్డు వేస్తున్న విధానం ఆక్షేపణీయమన్నారు. రైతు అప్పలనాయుడు రోడ్డు నిర్మాణం ఆపాలని అన్ని స్థాయిల్లో అధికారులకు వినతి పత్రం సమర్పించినా ఎటువంటి స్పందన రాకపోవడంతో కోర్టుని ఆశ్రయించారని తెలిపారు. రైతుకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వై.రాము, నాయుడు, కాసుబాబు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలందక రెవెన్యూ సిబ్బంది అవస్థలు



బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం

బుచ్చెయ్యపేట: మండల రెవెన్యూలో కింద స్థాయి సిబ్బందికి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా పండగకు జీతం ఇవ్వకపోగా కనీసం దీపావళి పండగకైనా జీతాలు అందించి ఆదుకోవాలంటూ కోరుతున్నారు. ఈ నెల 12వ తేదీ దాటినా మండలంలో పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు, వీఆర్‌ఏలకు జీతాలు అందలేదు. ఒకే కార్యాలయంలో పని చేస్తున్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులకు జీతాలు పెట్టుకుని డ్రా చేసుకోగా, కింద స్థాయిలో వీఆర్వో, వీఆర్‌ఏలు 50 మందికి మాత్రం జీతాలను నిలుపుదల చేశారు. దసరాకు జీతాలు అందక ఇబ్బందులు పడ్డామని, దీపావళికైనా ఇంటిల్లిపాది సరదాగా గడపడానికి జీతాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా పసలమ్మ పండగ



పసలమారమ్మకు పూజలను నిర్వహిస్తున్న మహిళలు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామస్తులు ఆదివారం పసలమారమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ సతకంపట్టు పోతురాజు గుడి వద్ద పసలమారమ్మకు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఖరీఫ్‌లో పంటలు బాగా పండటంతోపాటు పశువులకు మంచి ఆరోగ్యం కలగాలని పండగను నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా గ్రామ ప్రధాన వీధుల్లో వసంతోత్సవం ఊరేగింపు చేశారు. ఈ వసంతాన్ని రైతులు పొలాలు, పాకల్లోను, పశువులపైనా చల్లారు. ఈ వసంతం చల్లడం వల్ల పశువులు వ్యాధులు బారిన పడకుండా ఉంటాయని రైతుల విశ్వాసం.

సీతంపేటలో..

దేవరాపల్లి: మండలంలోని సీతంపేటలో పసలమారమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసలమారమ్మకు పసుపు, కుంకుమ, పండ్లు నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పాడి, పంటలు వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులంతా డప్పులు, వాయిద్యాల నడుమ సాంప్రదాయ బద్ధంగా పసుపుకుంకుమలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



డ్రోన్స్ ద్వారా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ మండల యూనిట్ ఇంచార్జ్ మళ్ల నాగేశ్వరరావు తెలిపారు. మామిడిపాలెం గ్రామంలో రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పల రాజు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, డ్రోన్ ద్వారా మందుల పిచికారీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్గి తెగులు, సుడిదోమ నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానంలో చేసిన కషాయాలను డ్రోన్స్ ద్వారా స్ప్రేయింగ్ చేయడం వల్ల ఎకరాకు రూ.1500 ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూడి పరదేశీ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ వక్త పార్థసారథి

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ పరిరక్షణకు పాటుపడాలని ఆర్‌ఎస్‌ఎస్ వక్త పార్థసారథి కోరారు. మండలంలోని గణపర్తిలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి కర్రి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు శాఖల నిర్వాహకులు సతీష్,వాసు, సూకరాజు, యల్లపు శ్రీను, స్వయం సేవక్ సభ్యులు గణేష్ నాయుడు, కర్రి రామ నాగేశ్వరరావు, కాళ్ల చంద్ర మోహన్, కాయల ప్రకాష్, అల్లవరపు రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ, సోలార్ ప్యానల్స్ ఏర్పాటుపై అవగాహన

అచ్యుతాపురం రూరల్: మళ్లవరంలో సూపర్ జీఎస్టీ, సోలార్ ప్యానల్స్ ఏర్పాటుపై సర్పంచ్ పిన్నమరాజు వాసు ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు ధూళి వెంకట సింహాచలం, లక్ష్మి శిరీష, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సందర్శకులు సందే సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు జలకాలాటలు

నాతవరం: సరుగుడు జలపాతం సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం ఇక్కడ ఎత్తయిన రెండు కొండలు మధ్యలోంచి జాలువారే నీటిలో సందర్శకులు జలకాలాటాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. సరుగుడు రోడ్డులో ఒక్కసారిగా వాహనాలు రద్దీ పెరగడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. అదే విధంగా తాండవ రిజర్వాయరు వద్ద సందర్శకులు సందడి నెలకొంది. తాండవ రిజర్వాయరులో నీటిమట్టం పుష్కలంగా ఉండటంతో ఇక్కడా సందర్శకులు సరదాగా కాలక్షేపం చేశారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టౌన్ సీఐ గోవిందరావు

నర్సీపట్నం: ఎస్పీ ఆదేశాల మేరకు నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం సీఐ గోవిందరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ ఎలాంటి క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో సమాజంలో జీవించాలన్నారు. రౌడీషీటర్ల ప్రవర్తనల్లో మార్పు చోటు చేసుకోవాలన్నారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం మీపై పోలీసు నిఘా ఉంటుందన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ



మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ రామయ్యపట్నం, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. మధ్యాహ్నం 4 గంటలకు ఈ కార్యక్రమంలో కోటి సంతకాలతో పాటు, రచ్చబండ కార్యక్రమంలో గ్రామ కమిటీల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి శస్త్ర చికిత్సలకు బస్సులో తరలిస్తున్న నిర్వాహకులు

మునగపాక: మునగపాకలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక గణేష్ బెస్ట్ మార్కెట్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. గ్రామీణ స్థాయిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులు దాడి శ్రీరామమూర్తి, టెక్కలి దేవకీ, దాడి సాంబశివలను ఆయన అభినందించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 115 మంది రోగులకు పరీక్షలు చేసి, 18 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌కు బస్సులో తరలించారు. ఈ శిబిరంలో డాక్టర్ జాక్సన్, ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్, స్టాఫ్ నర్స్ లావణ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎ.భీమవరంలో సారె ఊరేగింపు



గౌరీపరమేశ్వరులకు సారెను సమర్పించిన భక్తులు

కె.కోటపాడు: ఎ.భీమవరం రామాలయంలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరులకు సారెను భక్తులు సమర్పించారు. వివిధ రకాల పిండివంటలు తయారు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి గౌరమ్మకు సమర్పించారు. గౌరీపరమేశ్వరులకు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గౌరీపరమేశ్వరుల అనుపు కార్యక్రమాన్ని బుధవారం రాత్రికి వైభవంగా జరపనున్నట్లు సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, శేషు తర్రా మహేశ్వరరావు,చందు,పార్వతి తెలిపారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

అనకాపల్లి టౌన్: పశ్చిమ బెంగాల్‌లో ఐక్యూ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఒక సంఘటన మరువక ముందే మరో ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, సత్యనారాయణ, శివాజీ, వంశీకృష్ణ, దుర్గా, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.